# తోడు

సాయంత్రం నుంచీ జడి పట్టుకుంది. ఇప్పుడు మరీ జోరుగా కురుస్తోంది వర్షం. వీధి దీపాలు వెలుగనందు వల్ల వీధంతా చీకటిగా ఉంది.

దాదాపు అర్ధరాత్రి దాటి ఉంటుందేమో.

అందరి ఇళ్ళ తలుపులూ మూసి ఉన్నాయి - ఒక్క మా ఇంటి తలుపులు తప్ప. పిల్లలు దినేష్, విద్యలు ఆదమరచి నిద్రపోతూ ఉన్నారు. బయటి దీపం వేసుకుని నేనొక్కదాన్నే వరండాలో గోడకి జేరగిలబడి కూచుని ఉన్నాను.

నా మనసు మనసులో లేదు.

జీవితం మీద అర్థం కాని విరక్తి!

జీవితం అంటే వెలుతురూ, చీకటే అంటాడో కవి.

కానీ, జీవితం అంటే చీకటే చీకటి.

వెలుతురు కూడా ఉంటుందనేది భ్రమ.

ఎప్పుడైనా వస్తుందనుకోవడం పేరాశ.

ఇంతే. ఇంతే...

నా బతుకు ఇంతే. నన్నెవరూ బాగు చేయలేరు. ఏకాకిగా జీవితం గడపమని నా నుదుట రాసి ఉంటే ఎవరేం చేయగలరు! నా జీవితాన్ని నిత్య వసంతంగా మార్చేస్తానన్న మనిషి అయిపు లేకుండా పోయాడు. రాజారాం..! రాజారాం.. ఎలా వెళ్ళగలిగావు?

నా ఆలోచనలన్నీ రాజారాం మీదే..

మూడు రోజుల్నించీ పత్తా లేదు రాజారాం.

ఏమయినాడో తెలీదు.

ఎక్కడికెళ్ళాడో తెలీదు.

❀❀❀

ఆ వేళ మధ్యాహ్నం రిజిస్ట్రారాఫీసు నుంచి పెళ్ళి చేసుకుని ఇంటికి వచ్చాం. దగ్గరి మిత్రులకి చిన్నపాటి విందును అన్నపూర్ణ హోటల్లో ఏర్పాటు చేశాం.

రాజారాం ఎంత సరదాగా మిత్రులందరితోనూ జోకులు వేస్తూ ఉన్నాడో! అతని జోకులకి గలగలమని నవ్వుతున్నారు అందరూ. నేను బిడియంగా అంతా చూస్తూ ఉన్నాను. వాళ్ళలా ఎందుకు నవ్వలేక పోతున్నానో అర్థం కావడం లేదు నాకు.

ఇదంతా ఓ కంట కనిపెట్టినట్టున్నాడు రాజారాం. వాళ్ళ కొలీగ్స్‌కి నన్ను పరిచయం చేస్తూ "ఇట్లాంటి ఉత్తమురాలు నాకు భార్య కావడం నిజంగా నా అదృష్టం సార్" అన్నాడు. అబ్బా! అప్పుడు నేను ఎంత పొంగిపోయానో... గమ్మున టీవీ అనౌన్సర్‌లా నవ్వుతూ వాళ్ళకి నమస్కరిస్తూ ఉండిపోయాను.

"అందమైన అమ్మాయి భార్య కావడం నిజంగా మీ అదృష్టమే" అంటూ ఓ ముసలాయన ఇంగ్లీషులో అభినందించాడు.

"బాగా అన్నారు. మీ పొగడ్తలకి ధన్యవాదాలు" అని అర్థం వచ్చేలా రాజారాం ఇంగ్లీషులోనే బదులిచ్చాడు.

"మిస్టర్ రాజారాం.. ఈ పిల్లలూ.." అంటూ లావు మీసాల మనిషి నా పక్కనే ఉన్న పాపా, బాబుల్ని ఉద్దేశించి అడిగాడు.

కచ్చితంగా అప్పుడు ఇబ్బంది పడిపోతాడేమో అనుకున్నా! ఊఁహూఁ!

"ఈ పిల్లలు మా పిల్లలే. వీడేమో దినేష్. ఈ పాపేమో విద్య" అంటూ నవ్వుతూ ఇద్దరి బుగ్గల్ని పుణికి ముద్దు పెట్టుకున్నాడు.

అయితే, లావు మీసాల శాల్తీకి ఆయన సమాధానం తృప్తినివ్వలేదు. "అంటే.. మీ ఆవిడకీ.." అంటూ రాజారాం కళ్ళలోకి చూస్తూ ఆగాడు, తక్కినది తననే పూరించమన్నట్టుగా.

"అవును రామ్మూర్తిగారూ.. మా సుజాతకి ముందు భర్త వల్ల కలిగిన పిల్లలు. ఇప్పుడేమో నా పిల్లలు.. ఆయనకి విడాకులిచ్చేసిందిగా" అన్నాడు - అదీ ఏమాత్రం తొణక్కుండా, బెణక్కుండా నవ్వుతూనే. అక్కడ ఇబ్బంది పడింది నేనే.

"అయితే ఆ పిల్లలకి రెడీమేడ్ తండ్రి మీరు. బావుంది" అన్నాడు లావు మీసాలాయన ఇంగ్లీషులో.

అతని మాటలు పట్టించుకోనట్టు, ఎవరో మరేదో అడిగితే ఏదో చెబుతూ సిగరెట్టు వెలిగించుకుని మాట్లాడుతూ ఉన్నాడు రాజారాం.

విందు అయిపోయింది. ఇంటికి వచ్చేశాం. ఆయనకి ఇష్టమని స్ట్రాంగ్ కాఫీ చేసి ఇచ్చాను. "నీ ప్రేమలా ఉంది" అంటూ కొంటెగా చూసి అన్నాడు. కాఫీ తాగడం అయిపోగానే సిగరెట్టు వెలిగించుకుని, "కొంచెం పనుంది సుజా. నేను రావడం ఆలస్యమైతే భోజనం చేసెయ్యి. దయచేసి ఎదురు చూస్తూ కూచోకు" అని చెప్పేసి టకటక బయటికి వెళ్ళిపోయాడు. 'ఎక్కడికీ' అనడుగుదామనుకున్నాను. మొదటి రోజే అలా అడగడం ఏం బావుంటుందని అడగలేదు.

అంతే. ఆ రోజు వెళ్ళినవాడు ఈ రోజు వరకూ తిరిగి రాలేదు. ఈ మూడు రాత్రులూ నేను కునుకు తీసింది లేదు. తల నిండా ఎన్ని వేల ఆలోచనలో మెదడును కందిరీగల్లా కుదుతున్నాయి.

❀❀❀

అసలు ఏమయిపోయాడీ మనిషి!

సొంత ఊరికి వెళ్ళాడేమో! వాళ్ళ అమ్మా నాన్నా అతన్ని బాగా తిట్టి బలవంతంగా మరో పెళ్ళి చేశారేమో! ఏం జరిగితే మాత్రం ఏం చేయగలను నేను? ఏ తల్లిదండ్రులు మాత్రం ఒప్పుకుంటారు, తమ కొడుకు పిల్లల తల్లిని పెళ్ళి చేసుకుంటే!

పెళ్ళి జరిగిన రోజు ఆ లావు మీసాల మనిషి 'రెడీమేడ్ తండ్రివి' అని దెప్పిపొడుపుగా అన్నప్పుడు హర్ట్ అయ్యాడేమో! 'ఎందుకు పెళ్ళి చేసుకున్నానా' అని పశ్చాత్తాపంతో పిచ్చివాడిలా ఎక్కడ తిరుగుతున్నాడో!

భగవాన్! రాజారాంను కాపాడు తండ్రీ! నేను తెలిసి మోసం చేసిందీ లేదు, అతన్ని వలలో వేసుకుందీ లేదు. రాజారాంతో పరిచయమైన ఆ రోజు నాకు బాగా జ్ఞాపకం.

సాయంత్రం నుంచీ బాబుకు ఒళ్ళు వెచ్చగా ఉంది. వాడిని డాక్టరు దగ్గరికి తీసుకుపోదామా, వద్దా అని ఆలోచించి, ఈ మాత్రం జ్వరానికి డాక్టరు దగ్గరికి పోవడమెందుకు లెమ్మని ఇంట్లో మాలడిన్స్ మాత్ర ఉంటే సగం మింగించాను. గుంటకల్లా తగ్గినట్టు తగ్గి, అర్ధరాత్రి దాటుతుంటే ఎక్కువైపోయింది జ్వరం. ఒకటే కాలిపోతోంది ఒళ్ళు. ఒంటి మీద జొన్న గింజలు వేస్తే పేలాలు అయిపోయేంతలా ఉంది జ్వరం. ఏం చేయాలో పాలు పోలేదు నాకు.

పక్కింటి అరుణని లేపాను. పరిస్థితి చెప్పాను.

"నేనూ మా అమ్మేనక్కా ఇంట్లో ఉండేది. మా నాయన గుత్తికి కేంపు పోయినాడు" అందా పిల్ల.

అంతలో అరుణ తల్లి ఈశ్వరమ్మ వచ్చింది. "ఏయ్ అరుణా! ఎదురింటి రాజారామన్న నీకు బాగా

పరిచయమేకదే! పోయి లేపు - పరిస్థితి ఇట్లుందని చెప్పు - తప్పకుండా వస్తాడు" అంటూ నా వైపు తిరిగి, "అతను చానా మంచివాడు సుజాతా! వీళ్ళ నాయనకి ఒకసారి పెన్సిలిన్ సూది వేయించుకున్నదానికి రియాక్షన్ వచ్చింది. అప్పుడు నాకు చేతులూ, కాళ్ళూ ఆడలేదమ్మా. అట్లాటప్పుడు అతనేనమ్మా డాక్టరు దగ్గరికి తీసుకుపోయి అవేవో ఇంజక్షనులు ఏపిచ్చినాడమ్మా! ఆయప్పని ఈ రోజుకీ దేవునట్లావోడు అంటాడు వీళ్ళ నాయన" అంది.

ఎప్పుడు వెళ్ళిందో ఆ పిల్ల. అయిదు నిమిషాల తర్వాత అతణ్ణి వెంటబెట్టుకు వచ్చింది.

బాబు నుదురు అరచేత్తో తాకి చూశాడు రాజారాం. "చాలా జ్వరంగా ఉందే - పెద్దాసుపత్రికి వెళ్ళడం మంచిది. దగ్గర్లో ఎక్కడా ఆటోలు కూడా దొరకవు. ఏమండీ! మీరు ఏమీ అనుకోకపోతే బాబుని ఎత్తుకుని స్కూటర్లో కూచుంటే నేను తీసుకెళ్తాను" అన్నాడు. సరేనన్నాను.

నిద్రపోతున్న పాపను కాస్త చూసుకోండని ఈశ్వరమ్మకి చెప్పేసి బయల్దేరాను స్కూటర్లో.

తక్కువ స్పీడులో నడుపుతున్నాడతను స్కూటర్ని.

అక్కడక్కడ దారి పొడుగునా దీపాలు ఉన్నాయి. నిర్మానుష్యంగా ఉంది రోడ్డు.

"మేడమ్! మీరు అనిమల్ హజ్బెండరీలో కదూ పని చేస్తోంది" అనడిగాడు రాజారాం.

"అవును సార్" అన్నాను బాబుని మరింత జాగ్రత్తగా పట్టుకుంటూ.

"ఒకసారి మీ ఆఫీసుకు వచ్చానండీ. మీ ఎస్టాబ్లిష్మెంట్ గుమాస్తా మునిదాసు లేడూ, ఆయన నాకు బాల్య స్నేహితుడేలేండి".

"అట్లాగా సార్! మీరు ఎందులో పని చేస్తున్నారు?" అడిగాను.

"సోషల్ వెల్ఫేర్ డిపార్ట్మెంటులో".

"వార్డన్గానా?"

"కాదు మేడమ్! సీనియర్ అసిస్టెంటుగా. మేడమ్! బాబుని జాగ్రత్తగా పట్టుకోండి స్పీడ్ బ్రేకర్లు ఉన్నాయిక్కడ".

"సరే సార్".

నెమ్మదిగా స్పీడ్ బ్రేకర్లని దాటించాడు.

"మీరే లేకుంటే నా పరిస్థితి ఎంత దారుణంగా ఉండేది" అన్నాను.

"దాందేముంది మేడమ్! సార్ ఎక్కడ పని చేస్తున్నారు మేడమ్" అంటూ అడిగాడు మా వారి గురించి.

కొంత కలత చెంది అప్రయత్నంగా "మా వారా" అన్నాను. అలా ఎందుకన్నానో!

"అవును మేడమ్".

"యూనివర్సిటీలో ఫిజిక్స్ రీడర్ సార్".

" ఏ ఊరికయినా కేంపు వెళ్ళారా?"

"లేదు సార్. ఆయన రారు" అని ఊరుకున్నాను, కొత్త మనిషితో వ్యక్తిగత విషయాలు మాట్లాడ్డం ఇష్టం లేక. "ఎందుకు రారూ" అని అడుగుతాడేమోనని భయమేసింది. నా భయాన్ని పసిగట్టినట్లున్నాడు. మరేమీ మాట్లాడలేదు. పెద్దాస్పత్రి చేరుకున్నాం.

స్కూటర్ని నిలబెట్టిందే తడవుగా నా చేతుల్లోంచి బాబుని తీసుకుని భుజమ్మీద వేసుకుని ఎమర్జెన్సీ వార్డులోకి పరుగులాంటి నడకతో వెళ్ళాడు. నేను అతణ్ణి అనుసరించాను.

డాక్టరు బాబుని పరీక్ష చేసి, "హాస్పిటల్లో అడ్మిట్ చేయండి" అన్నాడు.

నేను బాబుని ఎత్తుకుని పిల్లల వార్డులోకి వెళ్ళాను.

నాలుగు మంచాలున్న గదిలో ఖాళీగా ఉన్న మంచం చూపించింది నర్సు. అక్కడ అందరూ నిద్రావస్థలో ఉన్నారు. నర్సు థర్మామీటరుతో బాబుకి టెంపరేచరు చూసి వెళ్ళిపోయింది. నా వెనకాల అలికిడి అయితే రాజారాం వచ్చాడేమోనని చూశాను.

ఆశ్చర్యం.. మావారు! ఛ.. నాకు ఒకప్పటి భర్త!

"నాన్నా!" అన్నాడు బాబు బలహీన స్వరంతో, ఏడుపు మొహం పెట్టి. వాళ్ళ నాన్నతో సానుభూతి పొందాలనేమో.

"నేను లేకున్నా మీ అమ్మ ఒక్కతే అన్నీ చూసుకోగలదురా. ఎందుకేడుస్తావు? ఇంకేం మీ అమ్మకు సహాయం చేసేవాళ్ళు కో అంటే కోటి మంది ఉన్నారు. నా అవసరం ఏమీ లేదు" అంటూ నా వైపు చురచురా చూశాడు.

"ఏమండీ.." అని అరుద్దామనుకున్నా. ఏదో చెబుదామనుకున్నా. నా గొంతు ఎందుకో పెగల్లేదు. అయినా, నేను సంజాయిషీ ఎందుకు చెప్పుకోవాలి ఈ నీచుడికి? ఉంచుకున్న దాని తళుకు బెళుకులకు లొంగిపోయి నాకు విడాకులిచ్చిన మనిషితో ఇంకా మాటలేమిటీ?

నేను మౌనంగా ఉండిపోయేసరికి...

"ఇంకేం తోడు దొరికిందిగా.. మగవాడు తప్పుడు దారి తొక్కడం సహజం. ఇప్పుడు ఆడది తప్పుడు దార్లో నడుస్తూ ఉంది. ఛీ.. ఛీ... ఆడదై పుట్టినందుకు సిగ్గూ ఎగ్గూ ఉండాలి. అర్ధరాత్రీ అపరాత్రీ అనకుండా స్కూటర్లో పరాయి మగాడితో తిరగడాలు.. అసహ్యమేస్తోంది ఆ మొహం

చూడాలంటే" అనేసి వెళ్ళిపోయాడు.

"నాన్నా! నాన్నా" అంటున్న బాబుని తిరిగయినా చూడలేదు. నా కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

"ఎందుకమ్మా ఏడుస్తావు? నాన్నెప్పుడూ అంతే కదమ్మా" అంటున్నాడు వాడు.

"మేడమ్! ఈ అడ్మిషన్ షీట్‌ని నర్సు గదిలో ఇచ్చి రండి" అంటున్న రాజారాం మాటలు విని, కన్నీళ్ళు కనబడనీయకుండా తల వంచుకుని దాన్ని, అందుకుని నర్సు గదిలో ఇచ్చి వచ్చాను. రాజారాం బాబు పక్కనే మంచం మీద కూచుని వాడి దుప్పటిని సవరిస్తూ ఉన్నాడు.

"ఆయనేనా మీ వారు?" అడిగాడు రాజరాం తలైనా ఎత్తకుండానే. ఊహించని ప్రశ్న అతని నుంచి వచ్చేసరికి ఏం మాట్లాడలేకపోయాను. అతనే నా వైపు చూశాడు. అప్పుడు తప్పదన్నట్టుగా 'అవు'నని తల ఆడించాను బాబు వైపు చూస్తూ.

"వీడికి జ్వరం వచ్చిందని తెలిసి చూడ్డానికి వచ్చారు. ఏదో అర్జెంటు పనుందని వెళ్ళిపోయారు" అంటూ బొంకాను.

"మీరేమీ అనుకోనంటే ఒక మాట మేడమ్! మీ వార్ని గురించి ఇట్ల మాట్లాడుతున్నందుకేమీ అనుకోకండి. ఆయన భార్యకి ఛాతీ నొప్పి వచ్చిందని ఇక్కడికి తీసుకువచ్చారు. ఇందాక ఆయన అడ్మిషన్ షీట్ రాయిస్తూ ఉంటే తెలిసింది. నేను మీ పేరూ, బాబు పేరూ రిజిస్టరులో రాయిస్తుంటే, ఆయన నన్ను చాలా ప్రశ్నలే వేశాడు - 'వాళ్ళకి మీరేమవుతారు? మీకెందుకింత ఇంట్రెస్టు' అంటూ తీరా ఇక్కడికొచ్చే సరికి మిమ్మల్ని అంటున్న మాటల్ని బట్టి తెలిసింది ఆయన ఎవరో" అన్నాడు రాజారాం.

నేనేం మాట్లాడలేదు.

"సారీ మేడమ్! మిమ్మల్ని ఇబ్బంది.." అంటూ ఆగాడు.

"పరవాలేదు" అన్నాను. అప్పుడు తెలిసింది నాకు, నా గొంతు ఎంత గద్గదమైపోయిందీ.

రెండు రోజుల తరువాత బాబుకి జ్వరం తగ్గింది. ఆస్పత్రి నుంచి ఇంటికొచ్చేశాము.

అప్పటి నుంచి మా పరిచయం స్నేహంగా మారింది.

పిల్లలిద్దరికీ కొద్ది రోజుల్లోనే అతి దగ్గరైపోయాడు రాజారాం. ఇదిలా ఉండగా, ఓ రోజు సాయంత్రం రాజారాం మా ఇంట్లోకి అడుగుపెడుతుంటే ఈశ్వరమ్మ పిలిచింది అతణ్ణి.

"ఇద్దో రాజారాం.. ఇదేం బాగలేదయ్యా! నువ్విట్ల మగవాళ్ళు లేని ఇంటికి వచ్చేదీ, గంటలు గంటలు మాట్లాడిపొయ్యేదీ. చూసేవాళ్ళకి ఎబ్బెట్టుగా ఉంటుంది. ఈ చుట్టుపక్కల ఉండేదంతా సంసారులేనయ్యా, సానులు కాదు" అంది కాస్త మెత్తగానే.

"సారీ అక్కయ్యగారూ! మీరు నన్ను తప్పుగా అనుకుంటున్నారు. నేను ఎట్లాంటి మనిషినో ఈ అయిదేళ్ళలో మీకు తెలీదా!" సానునయంగా రాజారాం కంఠం వినిపించింది.

"తెలుసునయ్యా! అందుకే కదా సున్నితంగా అంటున్నాను. ఆమెకు మొగుడు విడాకులిచ్చినాడు. ఒంటరి ఆడమనిషి... నలుగురూ నానా మాటలు అనుకుంటారయ్యా. ఇది పాడు లోకం" అంది మరింత నెమ్మదిగా.

గదిలోంచి అన్నీ వింటున్నానే కానీ, బయటికి రాలేదు. మూగగా రోదించాను. ఈ మధ్య రాజారాం పరిచయంతోనే కొంత ఊరటగా ఉంది. పిల్లలయితే మరీను. 'అంకుల్.. అంకుల్' అంటూ అతని ఒళ్ళోకి ఒదిగిపోతారు.

కిటికీలోంచి బయటికి తొంగి చూశాను. అప్పటికే రాజారాం వాళ్ళ ఇంటికి వెళ్ళిపోతున్నాడు.

"ఏమ్మా సుజాతా" అంటూ వాకిట్లోంచి పిలుస్తూ లోపలికి వచ్చింది ఈశ్వరమ్మ.

"ఏం పిన్నీ" అన్నాను. ఆమె నన్నేమైనా అంటుందేమోనని నా గుండెలు దడదడలాడుతున్నాయి.

"ఏం లేదమ్మా! రాజారాంని దండించాను. నువ్వు వినే ఉంటావు. జాగ్రత్తగా ఉండాలమ్మా. తాళి కట్టినోడితో తప్పా పరగా మొగోనితో మాట్లాడితే ఆడిపోసుకుంటాదమ్మా ఈ లోకం. దానికెందుకు అవకాశం ఇయ్యల్ల చెప్పు! నీ పరిస్థితి తెలుసునమ్మా నాకు. మీ ఆయన ఎట్ల అన్యాయం జేసినాడో అన్నీ తెల్సు.." అంటూ ఆగింది.

నేనేం మాట్లాడలేదు. నిర్లిప్తంగా ఆమె మొహంలోకి చూస్తూ ఉండిపోయాను.

మళ్ళీ తానే, "మీ ఆయన ఎవత్తో వగలాడిని మరిగి నీకు విడాకులిచ్చినాడు. నీదింకా చిన్న వయస్సే కదమ్మా! ఎవర్నన్నా పెండ్లి జేసుకోకూడదా... ఇట్లంటుండానని ఏమీ అనుకోవాకు తల్లీ. మా పెద్ద పాప భర్త చనిపోతే రెండో పెండ్లి చేసుకొనిందమ్మా.. మొదట్లో 'ఆడదానికి రెండో పెండ్లి ఏంటికి' అని ఏడ్చి మొత్తుకుంటినమ్మా నేను. ఇప్పుడిప్పుడు అనిపిస్తా ఉంది – అది మంచి పని చేసిందని' అనేసి వెళ్ళిపోయింది ఈశ్వరమ్మ.

అదివరకు లేని కొత్త ఆలోచన కలిగించింది ఈశ్వరమ్మ. అయినా, స్నేహితునిలా ఉన్న మనిషిని పెళ్ళి చేసుకోమనడం ఎట్లా! అందులో నేను పిల్లల తల్లిని. వద్దు.. వద్దు! ఇది అత్యాశ. అతని స్నేహమే చాలు. ఒక మంచి స్నేహితుడు దొరకడం అదృష్టాల్లోకెల్లా గొప్ప అదృష్టం.

ఆ మరుసటి రోజు మా ఆఫీసుకి వచ్చాడు రాజారాం. బయటికి రమ్మన్నాడు.. వెళ్ళాను.

క్యాంటీన్‌లోకి వెళ్ళి కూచుని కాఫీ తాగుతూ ఉన్నాం. అతనేం మాట్లాడ్డం లేదు. నేనూ ఎందుకో మాట్లాడలేకపోతున్నాను. చివరికి నేనే –

"సారీ రాజారాంగారూ! నిన్న ఈశ్వరమ్మ మిమ్మల్ని.." అంటూ పూర్తి చేయలేకపోయాను.

"ఇట్సాల్ రైట్ మేడమ్. ఆమె అట్ల అనడంతో నేనో నిర్ణయానికి రావడానికి వీలయింది" అన్నాడు, సిగరెట్టు వెలిగించుకుని.

"ఏం నిర్ణయం?"

"మిమ్మల్ని పెళ్ళి చేసుకోవాలని.." అన్నాడు దృఢంగా.

"రాజారాం గారూ! మీరు తొందరపాటు నిర్ణయం.." అని నేను మాట్లాడబోతూ ఉంటే -

"ప్లీజ్ సుజాతగారూ! నా నిర్ణయం మీకు నచ్చకుంటే 'నో' అని ఒక్క మాటతో చెప్పండి. లేకుంటే మరేం మాట్లాడకండి. మీ మౌనమే అంగీకారం నాకు.. నాకు మీ పైనా, మీ వ్యక్తిత్వం పైనా అపారమైన గౌరవముంది... పిల్లల విషయం దిగులు చెందకండి. ఇక మీ పిల్లలే నా పిల్లలు. కాదు, మన పిల్లలు. సరేనా.. బాగా ఆలోచించే ఈ నిర్ణయానికి వచ్చాను" అన్నాడు. సిగరెట్టు పొగని తృప్తిగా పీల్చి, ఆనందంగా గాలిలోకి ఊదాడు.

నేను స్థాణువులా ఉండిపోయాను మౌనంగా.

ఆ తర్వాత ఒకటిన్నర నెలకేమో, రిజిస్ట్రారు ఆఫీసులో మిత్రుల సమక్షంలో పెళ్ళయిపోయింది.

పెళ్ళయ్యే వరకూ నీడలా నన్ను వెన్నంటి ఉన్న మనిషి, పెళ్ళయిన సాయంత్రం నించీ ఏమయినాడు? మా కొలీగ్ మునిదాసు, రాజారాం ఆచూకీ తెలుసుకోవాలని చాలానే ప్రయత్నించాడు. ఊఁహూఁ - ఫలితం లేకపోయింది.

ఈ మూడు రోజులూ యాంత్రికంగా పిల్లల కింత అన్నం వండి పెడుతున్నానంతే. మనసులో కుళ్ళి కుళ్ళి ఏడవని క్షణం లేదు. అసలీ మనిషి నా జీవితంలోకి ఎందుకు ప్రవేశించాలి?

ప్రవేశించాడు.. మాట మాత్రమైనా చెప్పకుండా ఎందుకు అదృశ్యమవాలి? నేనేమైనా బాగా మోసపోయానా? బయట వర్షం తగ్గింది.

మనసులో మాత్రం ప్రశ్నల వర్షం కుండపోతగా కురుస్తోంది.

ఇంటి ముందు ఆటో వచ్చి ఆగింది.

టక్కున లేచి నిలుచున్నాను. రాజారాం!

ఆటోలోంచి రాజారాం.. దిగుతున్నాడు.

రాజారాం!! కలా? నిజమా? నిజమే!

రాజారాం... దిగాడు ఆటోలోంచి.

నా ఆనందానికి పట్టపగ్గాల్లేవు. నా మనసు ఆనందతాండవం ఆడుతోంది. ఇన్నాళ్ళూ ఎక్కడికెళ్ళాడీ మనిషి! ఇప్పుడు వస్తూనే ఎక్కడికెళ్ళిందీ చెబుతాడా? దాట వేస్తాడా? ఎక్కడికయినా వెళ్ళనీలే - ఇప్పుడు వచ్చాడు. అంతే చాలు.

ఆటో వెళ్ళిపోయింది.

గేటు తీసుకు వచ్చాడు రాజారాం.

"ఏమండీ!" అన్నాను డగ్గుత్తికతో. ఏం మాట్లాడాలో తెలీలేదు. నాలో ఉన్న ప్రశ్నలన్నీ ఆ ఒక్క మాటలోనే వచ్చినట్టు అనుకున్నాను. అతని ఎదపై సోలిపోయి సన్నగా ఏడుస్తూ ఉన్నాను.

అతను నన్ను ఓదారుస్తున్నట్టు మృదువుగా నా వీపుపై చరుస్తూ, హత్తుకుని, "ఏం సుజా! మరీ చిన్నపిల్లలా... పిల్లలు నిద్ర లేస్తారు. ఆకలిగా ఉంది - భోం చేద్దాం పదా" అన్నాడు.

అయిదు నిమిషాల్లో వడ్డించాను.

ఎంత ఆకలిగా ఉన్నాడో పాపం. ఆవురావురుమంటూ భోం చేస్తున్నాడు. ఏం మాట్లాడలేదు నేను. రాజారాంనే చూస్తూ తింటూ ఉన్నాను. అతను మాత్రం అప్పుడప్పుడూ నవ్వుతూ, నన్ను చూస్తూ అన్నం ముద్దల్ని నములుతూ ఉన్నాడు.

భోజనమయ్యాక సిగరెట్టు వెలిగించుకుని, "పిల్లలు ఆరోగ్యమే కదా" అని అడిగాడు. చెప్పాను.

పరుపును సర్దుతూ అడిగాను "ఎక్కడికెళ్ళా విన్నాళ్ళూ?"

"బళ్ళారి"

"ఏం, ఎందుకూ? ఒక్క మాటయినా బళ్ళారి వెళ్తున్నట్లు చెప్పిపోయేది లేదా? నీ కోసం నేనూ, పిల్లలూ ఎంతగా దిగులు పడిపోయామో తెలుసా" అన్నాను, అతని పక్కనే కూచుంటూ.

"తెలుసు" అన్నాడు నవ్వుతూ.

"క్షణం క్షణం నేను నరకం అనుభవించాను - తెలుసా?"

"తెలుసు".

"నిజం చెప్పండి. నీకు నా మీద కోపం వచ్చింది కదూ! పిల్లల తల్లిని చేసుకున్నానే అని జీవితం మీద విరక్తి కలిగింది కదూ! అందుకే..." అంటూ గద్గద స్వరంతో మాటలు రాక ఆగిపోయాను. నా కళ్ళలో నీటి పొర కదలాడింది.

అంతవరకూ తాగుతున్న సిగరెట్టుని మూలకు విసిరేసి, నన్ను దగ్గరికి తీసుకుని కళ్ళలోకి చూస్తూ, "సుజా! ఈ రోజు అన్నావు సరిపోయింది. మరిక ఎప్పుడూ ఇట్లా మాట్లాడకు - హాస్యానికి కూడా సహించను" అన్నాడు రాజారాం.

"మరి... ఇన్ని రోజులూ.. మమ్మల్ని ఇట్లా వదిలిపెట్టీ.." అన్నాను.

"నిజం చెబితే ఏమీ అనవుగా" అన్నాడు.

"ఊఁహూఁ.. ఏమీ అన్ను!"

"నువ్వు... బాధపడనంటే చెబుతా.."

"చెప్పండి" అన్నానే కానీ, నేను వినకూడనిది చెబుతాడేమో, విని భరించగలనా అన్న సందేహం నా మనసు మారుమూలలో ఎక్కడో మెదులుతోంది.

"నువ్వు శారీరకంగా అంత బలమైనదానివి కాదు సుజా. రెండో సారి డెలివరీ సమయంలో చచ్చి బతికానని ఓసారి నాతో అన్నావు. గుర్తుందా.. నిన్ను మనసా, వాచా ఇష్టపడి పెళ్ళి చేసుకున్నవాణ్ణి. నీ మీద ఈగ వాలినా సహించను. నీకు మరో మారు కానుపు గండం రాకూడదు అనుకున్నాను. అందుకే... బళ్ళారిలో మా ఫ్రెండ్ నర్సింగ్ హోంలో నేను వేసెక్టమీ ఆపరేషన్ చేయించుకున్నాను. మనకి ఈ ఇద్దరు పిల్లలూ చాలు. ఈ పిల్లలే నా పిల్లలు.. మరో రెండు రోజుల వరకూ మనం దూరం పాటిందాలి.." అంటూ చెప్పుకుపోతున్నాడు రాజారాం.

నా కళ్ళలో జివ్వున నీళ్ళు తిరిగి ధారగా కారిపోతున్నాయి.

చేష్టలుడిగి అలా శిలాప్రతిమనయ్యాను.

- ఇండియాటుడే, 15, జూలై 1997